

# భవానీద్వీపం

-వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 8 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

మౌనంగా చేతులు కట్టుకుని శ్రద్ధగా వింటున్న ఉద్ధవుడు ' చిన్ని సందేహం స్వామీ!' అన్నాడు. నాకు తెలుసు అన్నట్లు చిరునవ్వుతో తల పంకిస్తూ ' అడుగు' అన్నాడు సమర్థ రాముడు. ఉద్ధవుడు సామాన్యుడు కాడు. శ్రద్ధలో, నిష్ఠలో, ఉపాసనలో, శిష్యులందరిలోనూ అగ్రగణ్యుడు. సమర్థ రాముని తర్వాత ఉద్ధవుని మాటకు విలువ, ఆ తర్వాత కళ్యాణ్ స్వామి మాటకు. ఉద్ధవుని జననమే అద్భుతంగా, సమర్థ రాముని ఆశీస్సులతో జరిగింది!

బాల్యంలోనే సంసారంపట్ల విరక్తితో పెళ్ళిపీటల మీదినుండి పారిపోయాడు సమర్థ రాముడు. మూడురోజులపాటు ఒక పెను వృక్షం చిటారు కొమ్మలమీద దాక్కుని, పెళ్ళికొచ్చిన పెద్దలు, బంధువులు ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయి, అంతా సద్దు మణిగిన తర్వాత చెట్టుమీదినుండి క్రిందకు దిగాడు. సరాసరి నాసిక్ వెళ్ళి, అక్కడి పంచవటిలో శ్రీ రామమూర్తి ని దర్శించుకున్నాడు. గోదావరి తీరంలో కుటీరం నిర్మించుకుని పన్నెండు సంవత్సరాలు తీవ్రమైన తపస్సు చేశాడు. శ్రీ రామ సాక్షాత్కారం పొందాడు. అక్కడినుండి పన్నెండు సంవత్సరాలు భారత ఖండం అంతా పర్యటించాడు. ఒక సారి కాదు, అనేకమార్లు.

అలా దేశ పర్యటన చేస్తున్న కాలంలో జరిగిందా విచిత్రం. ఒక గ్రామంలో ఆయన బోధనలు చేస్తున్నాడు ఒక ఉదయం. గ్రామస్తులు అందరూ ఆయనను దర్శించుకుని ప్రణామాలు చేస్తున్నారు. ఆయన ఆశీస్సులు ఇస్తున్నాడు. స్త్రీలను తేరిపార చూసేవాడు కాదు కనుక ఒక యువతి నమస్సులు చేసినప్పుడు, కనులు మూసుకుని ' బహుపుత్రవతీ భవ' అని ఆశీర్వదించాడు సమర్ధ రాముడు. వెంటనే ' వచ్చే జన్మలోనా స్వామీ?' అని ఆ యువతి ఘొల్లుమనడంతో ఆశ్చర్యపడిన ఆయనకు విషయం ఏమిటో గ్రామస్తులు తెలియజేశారు.

ఆ యువతి ఆ గ్రామపెద్ద కోడలు. కొద్దిరోజులక్రితమే వివాహమైంది. ఆ ఉదయం దురదృష్టవశాత్తూ ఆ నవవరుడు మరణించాడు. ఆ యువతీ 'సతీ సహగమనం' చేయడానికి నిశ్చయించుకుంది. దానికి ఏర్పాట్లు జరుగుతుండగా సమర్ధ రాముడు గ్రామంలోకి వచ్చాడు అని తెలుసుకుని సహగమనం చేసేముందు ఆ మహానుభావుడి ఆశీస్సులకోసం వచ్చింది. విషయం తెలుసుకున్న సమర్ధ రాముడు ' జయ జయ రఘువీర సమర్ధ! ఎంత పొరపాటు జరిగిపోయింది స్వామీ!' అని, 'నీ భర్త దేహం వద్దకు తీసుకెళ్ళు తల్లీ' అని ఆవిడ వెంట ఆవిడ ఇంటికి వెళ్ళాడు. అంతా చూస్తున్న వందలాదిమంది గ్రామస్తులు అనుసరించారు.

గ్రామపెద్ద ఇంటికి చేరుకున్న సమర్ధ రాముడు దుఃఖ సముద్రంలో మునిగిపోయిన గ్రామపెద్దను, ఆతని భార్యను, చూశాడు. హాహాకారాలు చెలరేగుతున్నాయి ఆ ఇంటి ప్రాంగణంలో. నిశ్చేష్టురాలై చితిమీదకు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న యువతిని జాలిగా చూశాడు. కమండలంలోని నీళ్ళను చేతిలోకి తీసుకుని 'శ్రీరామ జయరామ జయ జయ రామ' అనే మంత్రాన్ని ఉచ్చరిస్తూ మృతదేహంమీద చల్లాడు. పాఠకుడా! అది దివ్యమైన శ్రీరామ త్రయోదశాక్షర మంత్రం.

సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే సమర్ధ రాముడికి ఉపదేశం చేశాడు, నాకు తెలుసు. నాకు
తెలియనిదేమున్నదని! అక్షరకోట్లు ఆ మంత్రాన్ని మననం చేసి మంత్రసిద్ధిని పొందిన పరిశుద్ధుడు సమర్ధరాముడు!

శరీరంమీద మంత్రజలం పడడంతోనే నిద్రలోంచి మేలుకున్నవాడిలా లేచి కూర్చున్నాడు మరణించిన యువకుడు. గ్రామం ఒక పుష్పగుచ్ఛం అయ్యింది, సమర్ధ రాముడి పాద పీఠం అలంకృతం ఐంది. గ్రామస్తులు అక్కడే ఉండి తమను కరుణించాల్సిందిగా వేడుకున్నారు. మౌనంగా మనసులో శ్రీరామచంద్రుడిని వేడుకున్నాడు సమర్ధరాముడు. 'రామా! నీ ఆజ్ఞ లేకుండా ఏదీ జరగదే, ఆ ఆజ్ఞ ప్రకారమే ఆ యువకుడి ఆయుష్షు ముగిసింది. కానీ నీ భక్తుని పలుకు నిజం కావడం కోసం నీ ఆజ్ఞకు విరుద్ధంగా ఆతనికి ఆయుష్షును పోయాల్సివచ్చింది! రామచంద్రా! నన్ను మన్నించు' అని మనసులో పశ్చాత్తాపపడుతూ కదిలి వెళ్ళిపోయాడు సమర్ధరాముడు.

ఆనాటినుండీ తనకు ఎవరు నమస్సులు చేసినా కేవలం 'జయ జయ రఘువీర సమర్ధ' అని అనేవాడు కానీ ఏ అభీష్ట వరదానము, ఆశీస్సులు చేసేవాడు కాదు! కొంతకాలం తర్వాత ఆ పరిసరాలలో ఆయన మకాం వేశాడు అని తెలుసుకుని ఆ గ్రామపెద్ద కుమారుడు, ఆ యువతీ వచ్చి సమర్ధరాముని పాదాలమీద వాలిపోయారు. ఇప్పుడు వారి చేతిలో ఒక పసిబాలకుడు ఉన్నాడు.

మీ అనుగ్రహంతో బ్రతికి వీడికి తండ్రినైనాను. వీడు మీ సంపద స్వామీ, మీరే తీసుకోండి' అని ప్రాధేయపడ్డాడు ఆ యువకుడు. అన్ని బంధాలనూ వదులుకుని దేశంపట్టిన నాకు ఈ బంధం ఎందుకు, నేనేం చేసుకుంటాను వీడిని అని నిరాకరించాడు సమర్ధ రాముడు. ఏమి చేసినా చేయకున్నా వీడు మీ ప్రసాదమే. నా తొలి సంతానాన్ని మీకే సమర్పించుకుంటాను అని ఆనాడే మీ పాదాల సాక్షిగా ప్రమాణం చేసుకున్నాను నా మనసులో. మీరు కాదు అంటే నేను వీడితో సహా తనువును చాలిస్తాను అన్నది ఆ యువతి. సరే, ముందు వీడిని చక్కగా విద్యాబుద్ధులు చెప్పించి పెంచండి, ఏమి చేయాలో తర్వాత చెప్తాను అని అక్కడినుండి వెళ్ళిపోయాడు సమర్ధరాముడు. మరలా కొంతకాలానికి ఆ సమీప ప్రాంతంలో సమర్ధ రాముడు ఉన్నప్పుడు ఆ దంపతులు ఐదేళ్ళ బాలకుని తీసుకువచ్చి, వీడు మీ సొత్తు, మీ ఇష్టం అని సమర్పిస్తే, వాడికి ఉద్ధవుడు అని పేరుపెట్టి శిష్యునిగా అంగీకరించాడు సమర్ధ రాముడు. అంతటి విచిత్ర పవిత్ర చరిత్ర ఉద్ధవుడిది. ఆ ఉద్దవునికి ఇప్పుడొక సందేహం వచ్చింది!

– 9 –

'శ్రవణము, కీర్తనము..ఈ క్రమంలో ఎనిమిదవది సఖ్యభక్తి, చివరిది ఆత్మనివేదన కదా! క్రమం తప్పించి 'సఖ్యము' తో మొదలుబెట్టడం..' అంటూ అర్థోక్తిగా తన సందేహాన్ని వెలిబుచ్చి ఆగిపోయాడు ఉద్ధవుడు. చిరునవ్వు నవ్వి ' అవి సామాన్య సాధకుల మెట్లు, భక్తి సౌధాన్ని ఎక్కడానికి. ప్రహ్లాదుడు ఏడు మెట్లు ఎక్కే ఉన్నాడు ఆ సరికే! పరమాత్ముని సన్నిధి, సఖ్యము కావాలని తహతహలాడుతున్నాడు. ఆయనతో క్రీడించాలని వువ్విళ్ళూరుతున్నాడు. ఆత్మనివేదనం కూడా చేయకుండా ఉండలేని ముముక్షు స్థితిలో ఉన్నాడు, అందుకే నృసింహుడిని ' నాకేమీ వద్దు! నీ సన్నిధి ఇప్పించు' అని కోరుకున్నాడు. ప్రహ్లాదుని పలుకులను ప్రహ్లాదుడు పలికినట్టే వినిపించాడు పోతన మహానుభావుడు. గంగకు, పోతన కవితకు దోషం అంటదు ఉద్ధవబా!' అన్నాడు సమర్థుడు.

ఉద్ధవుడు సమాధానం పొందినవాడిలా ఏదో అనబోతుండగా ద్వారంవద్ద అలికిడి, జయ జయ గురుమహరాజ్ అని ఒక శిష్యుడి కంఠం వినిపించింది. సమర్థుని కనుసైగతో తలుపులు తెరచి బయటకు వెళ్లి వెంటనే వెనుతిరిగి లోపలి వచ్చాడు ఉద్ధవుడు. వినయంగా కొద్దిగా వంగి ఆయన దర్శనంకోసం అతిథులు వచ్చినట్లు తెలియజేశాడు. 'జయ జయ రఘువీర సమర్థ!' అంటూ ఆసనం మీదినుండి లేచాడు సమర్థరాముడు. ద్వారం వైపు అడుగులేశాడు, కృష్ణరాయలు, ఉద్ధవుడు, కళ్యాణ్ ఆయనను అనుసరించారు.

విశాలమైన దర్బారు వంటి గదిలో నగిషీలు చెక్కి, మెత్తని బాలీసులు అమర్చిన సింహాసనముల వంటి గద్దెల మీద ఠీవిగా కూర్చుని ఉన్నారు యిద్దరు. కొద్దిగా కురచగా, ఒత్తరిగా ఉన్న శరీరాలతో, క్షత్రియ వీరోచితమైన వస్త్రధారణతో, జాతిముత్యాలు కూర్చిన విలువైన తలపాగాలు ధరించి బింబము, ప్రతిబింబము అన్నట్లు ఉన్నారు. హావభావాలు, కనుముక్కుతీరు, వర్చస్సు అన్నింటా ఒక్క తీరుగా ఉన్నారు. వారి నుదుట తీర్చిన నామాలు మాత్రమే భిన్నంగా ఉన్నాయి. ఒకరు విభూది రేఖలు ధరించి ఉన్నారు, మరొకరు వైష్ణవశైలిలో ఊర్ధ్వ పుండ్రములను ధరించి ఉన్నారు. వారికి కొద్ది దూరంలో పోత పోసిన శిల్పాలవలె ద్వారం వద్ద వలయాకారములో చేతులు కట్టుకుని గంభీరమైన, నిశితమైన దృష్టులను ప్రసరిస్తూ ఎనిమిది మంది దృఢకాయులు నిల్చుని ఉన్నారు. వారి నడుములకు పొడవాటి విచ్చుకత్తులు ఉన్నాయి, దట్టీలకు బరువైన చురకత్తులు బిగించి ఉన్నాయి. బిరుసైన కోరమీసాలు వారి చూపుల్లా పదునుగా ఉన్నాయి.

సమర్థ రాముని రూపం కనుల ముందు ప్రత్యక్షము కాగానే ఒక్క ఉదుటున లేచి సాష్టాంగ దండప్రణామంతో నేలకు వాలి పోయారు అంతవరకూ, సుఖంగా కూర్చుని ఎదురుచూస్తున్న వారు యిద్దరూ. వారు అన్నదమ్ములు, వారు గోల్కొండ సామ్రాజ్యానికి రెండు కన్నులు, ఒక మేథస్సు, వారు అక్కన్న, మాదన్నలు! చిరుగాలికి భూమిమీద రాలిన సన్నజాజుల్లా తమ ప్రభువులు ఆ సన్యాసి పాదాలమీద వాలడం చూసి, తాము మోకాళ్లమీద వంగి తలలను వినయంగా వంచి నమస్కరించారు అక్కన్న మాదన్నల అంగరక్షకులు.

తన పాదాలచెంత సాష్టాంగంగా వాలిన అన్నదమ్ములను ప్రేమగా చూస్తూ 'జయ జయ రఘువీర సమర్థా!' అని ఆశీఃపూర్వకంగా నినదిస్తూ 'లేవండి నాయనలారా! మీరిప్పుడు ప్రభువులు' అని మరాఠీలో పలుకుతూ చిరునవ్వులు చిందిస్తూ ఒక ఉన్నతాసనం మీద ఆసీనుడైనాడు. వారిని తమ ఆసనాలను అలంకరించుమంటూ సంజ్ఞ చేశాడు. ఆయన నిశితమైన చూపులు అక్కన్న మాదన్నల అంగరక్షకులు ఎనిమిదిమందినీ నిశితంగా తడిమాయి. ఒక యిద్దరి మీద అయన చూపులు నిలకడగా నిలిచాయి.

'సర్వతంత్ర స్వతంత్ర హిందూ సామ్రాజ్య చక్రవర్తిసైతం మీ పాద దాసుడు, మేమనగా ఎంత? పొట్ట కూటికోసం పరాయి పంచన జేరిన పై పై మెరుగుల ప్రభువులం!' అంటూ వినయంగా ఒదిగి తన ఆసనంమీద కూర్చున్నాడు మాదన్న. సంభాషణ అంతా మరాఠీలోనే కొనసాగుతున్నది.

' మా ప్రభుతవ్యం, ఈ దేశ భవితవ్యం అన్నీ మీ ఆజ్ఞయే కదా స్వామీ!' అంటూ సమర్థరాముడి చూపులను అర్థం చేసుకున్నట్లుగా తలను వెనక్కు ఓరగా తిప్పి బలమైన తన కుడిచేతిని ఎత్తి ద్వారంవైపు చూపించాడు అక్కన్న. వినయంగా తలలు వంచి వందనం చేసి, వెనుకకు అడుగులు వేస్తూ విశాలమైన ద్వారం బయటకు వెళ్ళిపోయారు అంగరక్షకులు. ఉద్ధవుడు, కళ్యాణ్ వారి వెనుకే వెళ్లి, ద్వారానికి రెండుప్రక్కలా చేతులు కట్టుకుని బయట ఉన్నవారిని పరికిస్తూ నిలబడిపోయారు.

లోపలినుండి వెండి పళ్ళెరాలలో పండ్లు, మిఠాయిలు తీసుకొచ్చారు పరిచారికలు కొందరు. కొందరు చల్లని పానీయాలను తీసుకొచ్చారు. వారి వెనుకగా తనే స్వయంగా మదరబండిన మామిడిపండ్లను, పండిన వాసనలతో మహలును నింపేస్తున్న అరటిపండ్లను తీసుకునివచ్చి,

సమర్థరాముని ఎదురుగా ఉంచి నమస్కరించింది లక్ష్మీ బాయి. 'స్వీకరించండి స్వామీ' అని పలికి, ఆయన పాదాల చెంతనున్న పీఠంపై తను చేరాడు కృష్ణరాయలు.

'నమస్సులు అన్నా! క్షేమమేనా?' అని చిరునవ్వుతో పలుకరించింది లక్ష్మీ బాయి అన్నదమ్ములిద్దరినీ, మేలిముసుగును సవరించుకుంటూ. ' కుశలమే తల్లీ!' అని ప్రేమగా పలికిన అన్నదమ్ములకు వారి ముందున్న పదార్థాలను, పానీయాలను చూపుతూ' తీసుకోండి అన్నా!' అన్నది అభిమానంగా. ఒకసారి ఏర్పాట్లను కనుచివరలతో పరిశీలించి, సంతృప్తిగా తలపంకించి, లోపలి వెళ్ళిపోయింది. హంసల గుంపులా ఆమెను అనుసరించారు పరిచారికలు.

మౌనంగా శ్రద్ధగా కృష్ణరాయలు ముక్కలుచేసి ఇస్తున్న మామిడిపండ్లను ఆరగిస్తూ, ప్రశ్నించాడు సమర్థ రాముడు. 'ఏమి సంగతులు నాయనలారా? గోల్కొండ సామ్రాజ్యం ఎలా ఉంది? సుల్తాన్ ఆనందంగా ఉన్నాడా? ముజఫర్ ఏమంటున్నాడు?'

'దారితప్పిన లేడి కూనలా ఉన్నది స్వామీ, మీకు తెలియనిది కాదు కదా! అటు ఢిల్లీ పాదుషా, యిటు దక్షిణాది సుల్తానులు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అడపా దడపా ప్రయత్నాలు చేస్తున్నారు. సుల్తాన్ ఆనందంగానే ఉన్నాడు. అనుకూలుడిగానే ఉన్నాడు' సమాధానమిచ్చాడు మాదన్న.

'ముజఫర్ కోరలు తీసిన త్రాచు, ముడుచుకున్నాడు' అన్నాడు అక్కన్న. 'ప్రమాదం త్రాచువలన కాదు, కోరల వలన, మసి చేసేంతవరకూ విషపు కోరలు ప్రమాదకరంగానే ఉంటాయి' కొద్దిగా గంభీరంగా పలికాడు సమర్థుడు. మౌనంగా తల పంకించాడు మాదన్న, నిజమే అన్నట్లుగా.

'తనను, కొడుకును గృహనిర్బంధం చేసినదానికన్నా, తన స్థానంలో నీవు పాదుకొనడం, మీ అన్నదమ్ములు గోల్కొండ సామ్రాజ్యంలో పాదుషా తరువాత అత్యంత ముఖ్యులు కావడం ఆతనికి మరణ సదృశంగా ఉన్నది' అన్నాడు సమర్థుడు మాదన్నతో.

'అవును స్వామీ! ఇంకా అతడిని సమర్థించేవారు అక్కడక్కడ ఉన్నారు' అన్నాడు మాదన్న. 'అమాయకుడా! అక్కడక్కడ కాదు, నీ అంగరక్షకులలో ఉన్నా ఆశ్చర్యము లేదు. అంతఃపురం కూడా ఇంకా వారి అనుకూలులతోనే నిండి ఉన్నది' తల పంకిస్తూ దీర్ఘాలోచన చేస్తున్నట్లుగా అన్నాడు సమర్థరాముడు.

'మీ కొత్త పోకడలవలన గోల్కొండ సామ్రాజ్యం ఆర్థికంగా బలపడింది కానీ, ఇంతవరకూ ఆర్థికంగా పెత్తనం చెలాయించిన సైన్యాధికారులు, జాగీర్దారులు నష్టపోతున్నారు. వారందరూ మీ పతనంకోసం ఎదురుచూస్తున్నారు. అవకాశాలను అన్వేషిస్తున్నారు' తూచి తూచి మాట్లాడుతున్నాడు సమర్థరాముడు. మూసిన కనుల వెనుక తీవ్రంగా ఆలోచన చేస్తున్నట్లు ఉన్నది ఆయన ముఖం.

మామిడిపండ్లను ముక్కలుగా తరిగి, అరటిపండ్లను వలిచి అందిస్తున్న కృష్ణరాయలు మౌన శ్రోతగా ఉన్నాడు. చెవులు సంభాషణ మీద ఉన్నాయి, ఆయన మనసులో చరిత్ర వీచిన చిరుగాలులకు కదలాడుతున్న గోల్కొండ సామ్రాజ్య గాథల పరదాలు!

.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS